సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి

హిమాయత్‌నగర్,డిసెంబర్24: సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అసెంబ్లీలో ప్రజల సమస్యలపై చర్చించకుండా సీఎం రేవంత్‌రెడ్డి సినీ పరిశ్రమపై విమర్శలు చేయ డం సరైన విధానం కాదన్నారు.రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు,గురుకుల విద్యాసంస్థలో తరచుగా ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మృతి చెందుతుంటే.. దానిని పట్టించుకోకుండా అల్లు అర్జున్ విషయంను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకు వచ్చారని ఆరోపించారు. విద్యార్థులు అనుమానాస్పదంగా మర ణించడం, ఆత్మహత్యలు చేసుకుంటున్న వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలను సందర్శించి విద్యార్థుల మరణాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్,జాతీయ ఎస్సీ,ఎస్టీ మహిళా కమిషన్‌లు తక్షణమే విచారణ చేసి ఈఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అయ్యప్పస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాలు ప్రారంభం

బోరబండ డివిజన్ సైట్-2 కాలనీలోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయ 16వ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపతి హోమం, లక్ష పుష్పార్చన, మహా అన్నప్రసాదం, పడిపూజ తదితర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.లక్ష్మణ్‌గౌడ్, కమిటీ సభ్యులు బాలకృష్ణ, విజయకుమార్, తివారి, సత్యనారాయణ, సోమేష్, గోవింద్, సురేష్, శ్రీను పాల్గొన్నారు.
– ఎర్రగడ్డ, డిసెంబర్ 24:

కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్ తదితరులు

సజావుగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

చివరి సమావేశంలో రూ.21 కోట్లతో అభివృద్ధి పనులకు తీర్మాణాలు

మణికొండ, డిసెంబర్ 24 : నార్సింగి మున్సిపాలిటీ చిట్టచివరి కౌన్సిల్ పాలకవర్గ సమావేశం మంగళవారం సజావుగా ముగిసింది. ఐదేళ్ల పాటు పదవీకాలంలో కొనసాగుతున్న కౌన్సిలర్ల చివరి సమావేశం సమష్టి నిర్ణయాలతో పలు అభివృద్ధి పనులు, అసంపూర్తి పనులు, అపరిష్కృత సమస్యలపై స్పష్టంగా చర్చించి రూ.21కోట్ల 41 నిధులతో కొత్త పనులకు తీర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అధ్యక్షతన కొనసాగిన ఈ సమావేశంలో అన్ని వార్డులకు సమన్యాయం కల్పిస్తూ నిధుల కేటాయింపులు చేపట్టారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా సీసీ రోడ్లకు రూ.కోటి 35లక్షలు, బీటీ రోడ్లకు రూ.62లక్షలు, డ్రైనేజీ పనులకు రూ.కోటి 40లక్షలు, కమ్యూనిటీ హాల్ పనులకు రూ.ఆరుకోట్ల 65లక్షలు, వైకుంఠధామాల అభివృద్ధి కోసం రూ.50లక్షలు, వీధి దీపాల పనులకు రూ.70లక్షలు, ప్రహరీ గోడల నిర్మాణ పనుల కోసం రూ.35లక్షలు, శానిటేషన్ పనులకు రూ.కోటి 3లక్షలు, జంక్షన్ డెవలప్‌మెంట్ పనుల కోసం రూ.50లక్షలు, తాగునీటి పైపులైను పనుల కోసం రూ.4కోట్ల 69లక్షలు, చెత్తను తరలించడానికి రూ.2కోట్లు, ఇతర పనుల కోసం రూ.కోటి 62 లక్షలను కేటాయించినట్లు అధికారులు తెలిపారు.అయితే గత కౌన్సిల్ సమావేశంలో రూ.56కోట్ల 57లక్షలతో తీర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇదిలా వుండగా నార్సింగి మున్సిపాలిటీలో గడిచిన ఐదేళ్ల పాలక వర్గ కౌన్సిల్ సమావేశంలో సుమారు రూ.600 కోట్ల నిధులతో కౌన్సిల్ తీర్మాణాలు సాగించి రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ విజయబాబు, డీఈ నరేష్‌కుమార్, మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్,మున్సిపల్ అకౌంట్స్ అధికారి కృష్ణయ్య,వివిధ శాఖల అధికారులు, ఆయా వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో ఆపరేషన్ రోప్

రోడ్డు ఆక్రమణల తొలగింపు

ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా ఫిలింనగర్ బస్తీల్లో మంగళవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను ట్రాఫిక్ విభాగం, జీహెచ్‌ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో తొలగించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఫిలింనగర్ లోని ఏబీఎన్ చౌరస్తా నుంచి రౌండ్‌టేబుల్ స్కూల్ దాకా ఫుట్‌పాత్‌తో పాటు రోడ్లను ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన డబ్బాలు, చిరు వ్యాపారాలకు చెందిన సుమారు 30 షెడ్లు తొలగించారు. ఏబీఎన్ చౌరస్తా సమీపంలో వారాంతపు సంతను పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో వచ్చే వారం నుంచి ఇక్కడ ఎలాంటి మార్కెట్లు పెట్టవద్దని ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. వారాంతపు సంతను ఖాళీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు.
– బంజారాహిల్స్,డిసెంబర్ 24:

చిత్రపరిశ్రమ తరలిపోకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న శివనాగేశ్వర్ రావు

ఖైరతాబాద్, డిసెంబర్ 24 : రాష్ట్రంలో సినీ రంగంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో చిత్రపరిశ్రమ తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వంపై ఉందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎ) జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వర్ రావు కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో నేపథ్యంలో ఓ మహిళ మృతిచెందడం బాధాకరమని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, చిత్ర పరిశ్రమపై ఉందన్నారు. కొందరు స్వార్థ రాజకీయాలకు ఈ ఘటనను వాడుకుంటున్నారని, స్వయంగా ముఖ్యమంత్రే ప్రజల సమస్యలను పక్కన పెట్టి ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చిండం విస్మయానికి గురిచేసిందన్నారు. మహిళ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు చిత్ర పరిశ్రమను రక్షించుకునే ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో పోలీసులు పారదర్శకంగా వ్యవహరించేలా చొరవ తీసుకోవాలన్నారు.

వైద్య విద్యార్థులకు మెరిట్ లిస్ట్‌ను విడుదల చేయాలి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 24 : రాష్ట్రంలో మంచి మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందేలా వైద్య విద్యార్థులకు లోకల్ మెరిట్ లిస్ట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథ్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ వి. శోక్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నీట్, పీజీ కౌన్సిలింగ్ 2024-25కి సంబంధించి ఇండియా కోటాలో రెండు రౌండ్లు పూర్తయ్యాయని, కానీ మంచి వైద్య కళాశాలల్లో సీట్లు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ క్రమంలో డిసెంబర్ 27న ఆల్ ఇండియా కోటా లో 3వ రౌండు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని అన్నారు.

లోకల్ మెరిట్‌తో తెలంగాణలో సీట్లు పొందేలా వైద్య విద్యార్థులకు లోకల్ మెరిట్ లిస్టును విడుదల చేసి ఆదుకోవాలని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న రాజేంద్రనగర్ మండల ఎంఈవో శంకర్‌రాథోడ్

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 24: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకొన్ని శాస్త్రవేత్తలుగా ఎదగాలని రాజేంద్రనగర్ మండల ఎంఈవో శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం టాలెంట్ టెస్ట్‌ను మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా రాజేంద్రనగర్ మండల విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. ఇంగ్లిష్ మీడియంలో గణేష్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన పి.కార్తీక్, మైలార్‌దేవ్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బి.శ్రీలేఖ, అత్తాపూర్ పాఠశాలకు చెందిన బి.వసంతి, తెలుగు మీడియంలో మైలార్‌దేవ్‌పల్లి పాఠశాలకు చెందిన డి.రాజ్‌కుమార్, బి.సుషాంత్, అత్తాపూర్ పాఠశాలకు చెందిన శివత్రివేణిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. రాణించిన విద్యార్థులకు మంగళవారం రాజేంద్రనగర్ మండల ఎంఈవో శంకర్‌రాథోడ్ సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 27న జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ టీబీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి మాణిక్యంరెడ్డి, మండల ఇన్‌చార్జి రోజారాణి తదితరులు అభినందించారు.

సీపీఐ శత జయంతిని జయప్రదం చేయండి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్,డిసెంబర్24: సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఈనెల 26న ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.టీ.నరసింహ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలు చేసి వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి, పార్టీ చరిత్ర, సాధించిన పోరాట విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కేంద్రం లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి పేద వాళ్లను బానిసలుగా మారుస్తుందని విమర్శించారు.ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి,సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, నాయకులు ఎన్.శ్రీకాంత్, ఒమర్‌ఖాన్, మహమూద్ పాల్గొన్నారు.

నీట్ పీజీ కౌన్సెలింగ్ వెంటనే నిర్వహించాలి

పీజీ ఎంట్రన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థులు

ఖైరతాబాద్, డిసెంబర్ 24: నీట్ పీజీ కౌన్సెలింగ్‌ను వెంటనే నిర్వహించిన తమకు న్యాయం చేయాలని పీజీ ఎంట్రన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అభ్యర్థులు వెంకటేశ్ కుమార్ దుర్గం, వినయ్, వంశీ, మేఘన, శ్రీజ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆగస్టు 11న నీట్ పీజీ అర్హత పరీక్షలు జరిగాయని, సుమారు 8వేల మంది అభ్యర్థులు పరీక్షలు రాశారని, వీటికి ఆగస్టు 25న ఫలితాలు వచ్చాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తయ్యిందని, ఫలితాలు వచ్చి మూడు నెలలకు పైగా గడుస్తున్నా ఇంత వరకు కౌన్సెలింగ్ నిర్వహించలేదన్నారు. మరికొంత కాలం ఆలస్యం జరిగితే తమకు తీరని నష్టం జరుగుతుందన్నారు.

అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు..

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మంగళవారం రహ్మత్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో రహ్మత్‌నగర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ట్యాంక్ బండ్ వరకు ర్యాలీగా వెళ్లి కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు.
–జూబ్లీహిల్స్, డిసెంబర్24

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బాబుల్‌రెడ్డినగర్‌లో అభివృద్ధి పనులపై స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 24: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పద్మశాలిపురం, దుర్గానగర్, బాబుల్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఆయన జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్, సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుర్గానగర్‌లోని నాలాపై శ్లాబ్ పనులను వేగవంతంగా నిర్వహించాలన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో రైన్ వాటర్ డ్రైనేజీ లైన్ అవసరం ఉన్న చోట పొడిగించాలని సూచించారు. ఈ పర్యటనలో జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్‌భాను, జలమండలి మేనేజర్ ఖాదర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లోక్‌నాథ్, జాషువా, ప్రకాష్, నాయకులు కృష్ణ, ఎల్.వి.రెడ్డి, జంగారెడ్డి, వెంకటరమణగుప్తా, మన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

బంజారాహిల్స్,డిసెంబర్ 24: ఉత్తరాది నుంచి యువతులను తీసుకొచ్చి బంజారాహిల్స్‌లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఆర్గనైజర్‌తో పాటు మరో ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లో నిఖిత (27) అనే యువతి ఓ ప్లాట్‌ను అద్దెకు తీసుకుని వ్యభిచార గృహం నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఢిల్లీకి చెందిన ఇద్దరు సెక్స్‌వర్కర్లతో పాటు ఇద్దరు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకురాలు పరారీ కాగా ఇద్దరు కస్టమర్లను అరెస్ట్ చేశారు.వారిపై పిటా యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సెక్స్‌వర్కర్లను రెస్క్యూ హోమ్ కు తరలించారు.

మరోమారు తెరపైకి
వివాదాస్పద భూములు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 24 : శంషాబాద్ పట్టణంలోని హెచ్‌ఎండీఏ, ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదాస్పద భూముల విషయం తాజాగా మరోమారు తెరపైకి వచ్చింది. గతంలో హెచ్‌ఎండీఏ స్వాధీనంలోకి తీసుకున్న సర్వే నంబర్ 725 భూముల్లో హెచ్‌ఎండీఏ అవార్డును రద్దు చేసినట్లు ఇటీవల హైకోర్టు ధ్రువీకరించిన నేపథ్యంలో భూములు తమవేనని కోర్టులో పోరాడుతున్న వ్యక్తులు సంబంధిత భూములను రెండు, మూడు రోజులుగా తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఈ విషయంపై శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్ వివరణగా కోరగా మహ్మద్ మొయినుద్దీన్ అనే వ్యక్తి డబ్ల్యూపీ 33288 ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. హెచ్‌ఎండీఏ 1990 అవార్డును హైకోర్టు రెండు సార్లు రద్దు చేసినట్లు కోర్టు ధ్రువీకరించడంతో ప్రస్తుతం సంబంధిత భూములు తమవిగా భావిస్తూ సదరు వ్యక్తులు ఆ భూములను స్వాధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. విషయం ఇంకా కోర్టు పరిధిలోని ఉంది. ప్రభుత్వ భూమిగా ప్రభుత్వం నుంచి కౌంటర్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత హైకోరు ఇచ్చే తీర్పు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

1990లో అవార్డును రద్దు చేశారు పట్టాదారు తరపు న్యాయవాది

పట్టాదారులకు కాకుండా కౌలుదారులకు పరిహారం చెల్లించిన కారణంగా హెచ్‌ఎండీఏ 1990లో అవార్డును గతంలోనే హైకోర్టు రద్దు చేసినట్లు ఇటీవల న్యాయ స్థానం పరిశీలించి ధ్రువీకరించిందని పట్టాదారు తరపు న్యాయవాది మీడియాకు తెలిపారు. పట్టాదారులపై ఇప్పటికే నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు అన్ని కోర్టులో క్యాష్ అయ్యాయన్నారు. కోర్టు ఇచ్చే తీర్పులను సంబంధిత విభాగాలు గౌరవించాలన్నారు.

గో మాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలి

కాచిగూడ : ప్రతి ఒక్కరూ గో మాతను ప్రేమించాలని తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్ లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. గో మాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కాచిగూడ శ్యామ్‌బాబా మందిర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉస్మానియా వైద్య కళాశాలలో.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉస్మానియా వైద్య కళాశాలలో 1999 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థుల్లో ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కు చెందిన డాక్టర్ బి.ఉదయ్‌కుమార్ ,డాక్టర్ నాగలక్ష్మి, నాగసారిక, రియాజ్, వి.నీలిమల ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా 1999 బ్యాచ్‌కు చెందిన వారు మంగళవారం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.రజతోత్సవం సందర్భంగా జరిగిన ఈ సమ్మేళనానికి విచ్చేసిన వాళ్లంతా ఎంతో ఆప్యాయతగా మాట్లాడుకుని సహపంక్తి భోజనం చేసినట్లు డాక్టర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. – ఎర్రగడ్డ, డిసెంబర్ 24:

ప్రతి పోలీస్ స్టేషన్‌లో.. సైకాలజిస్ట్‌ను నియమించాలి

ఖైరతాబాద్, డిసెంబర్ 24 : రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఓ సైకాలజిస్టును నియమించాలని మాజీ ఐటీ ఉద్యోగి, నగరానికి చెందిన కేవీన్ ఎడ్వర్డ్స్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను చిత్ర నిర్మాతగా ఓ సినిమాకు పెట్టుబడి పెడితే కొందరు తనను మోసం చేశారని, ఈ విషయంపై ఓ న్యాయవాదిని ఆశ్రయిస్తే తనకు న్యాయం చేయకపోగా, తనపై తప్పుడు కేసు బనాయించారన్నారు. దీంతో పోలీసులు తన వద్ద సాక్షాధారాలకు సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారని, వాటిని తనకు తిరిగి ఇవ్వాలని కోర్టులో కేసు వేశానన్నారు. కొన్ని తప్పుడు కేసుల వల్ల కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇటీవల ఇలాంటి ఘటన ఒకటి జరిగిందన్నారు. తనకు సైతం కేసులు, వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుందామన్న ఆలోచన వచ్చిందని, కాని కొట్లాడి గెలవాలన్న సంకల్పంతో తాను ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాన్నారు.

ఎవరైనా పోలీసు స్టేషన్‌లో కేసులు పెడితే పూర్వాపరాలు తెలుసుకోకుండా కేసులు నమోదు చేయడం వల్ల ఎందరో అమాయకులు బలవుతున్నారన్నారు. వారి ఆత్మ స్థైర్యాన్ని కోల్పోతున్నారని, అలాంటి క్రమంలో పోలీసులు కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేయడంతో పాటు బాధితులు ఆత్మహత్యలకు పాల్పడకుండా పోలీసు స్టేషన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సైకాలజిస్ట్‌ను నియమించాలన్నారు.

వర్గీకరణ హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి: మందకృష్ణ

ఖైరతాబాద్, డిసెంబర్ 24: దేశంలో ఏబీసీడీ వర్గీకరణ ముందుగా చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వేదికగా నిర్వహించే 'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు' కార్యక్రమానికి మద్దతుగా పలువురు కళాకారులతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంద కృష్ణ మాట్లాడుతూ, వర్గీకరణ ఫలితాన్ని ఓ రాజకీయ పార్టీ వైపు మళ్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. గడిచిన 30 ఏండ్లుగా అన్ని పార్టీలతో మద్దతు కూడగట్టామని, అది జాతి ప్రయోజనం కోసమే చేసిందన్నారు. తన జీవిత కాలంలో కండువాలు మారలేదని, భవిష్యత్తులో మారదన్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీలో భారతదేశంలో ఎవరికి లేని పలుకుబడి మాలలకు ఉందని, ఆ వర్గమే పార్టీని శాసిస్తోందన్నారు. వారే వర్గీకరణను నేటికీ అడ్డంకులు కల్పిస్తూనే ఉన్నారని, కానీ, అడ్డుకోవడం ఎవరి తరం కాదని, ఆ ఫలాలను అందరికీ అందే వరకు విశ్రమించమన్నారు. వర్గీకరణను అడ్డుకునే వారిపై ధర్మ యుద్ధానికి సిద్ధమవుతున్నామని, అందులో కళాకారులు వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులు తోడవుతాయన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

జనవరి 3 నుంచి తెలంగాణ వ్యాప్తంగా రథయాత్రలు నిర్వహిస్తామని, ఫిబ్రవరి 3న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వేదికగా, మహా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, దండోరా కళా మండలి జాతీయ అధ్యక్షులు ఎన్‌వై అశోక్ మాదిగ, ప్రముఖ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, ప్రజా వాగ్గేయకారులు దరువు ఎల్లన్న, గిద్దె రామనర్సయ్య, రామంచ భరత్, ప్రముఖ రచయిత పసునూరి రవీంద్ర వాణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో..
డ్రైవర్‌కు గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 24: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం జలాల్‌బాబానగర్‌కు చెందిన సయ్యద్ మొహ్మద్ అలీ(27) కామారెడ్డిలోని తులసీ ఇండస్ట్రీలో డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాటేదాన్ పారిశ్రామికవాడ నుంచే సరుకు సరఫరా చేస్తుంటాడు. మంగళవారం ఉదయం సరుకు నింపుకునేందుకు రాగా కాటేదాన్ బుద్వేల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలోని పరిశ్రమకు వెళ్తు విద్యుత్ నియంత్రిక వద్ద డీసీఎంను నిలిపారు. ఆ సమయంలో డ్రైవర్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పని చేసిన ఇంటికే కన్నం

బండ్లగూడ, డిసెంబర్ 24 : పని చేస్తున్న ఇంటికే కన్నం వేసి నగదు, బంగారు ఆభరణాలతో దంపతులు ఉడాయించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ మఫీల్‌టౌన్ విల్లాలో నివాసం ఉండే కొండల్‌రెడ్డి ఇంట్లో కొంత కాలంగా బిహార్‌కు చెందిన నవీన్‌కుమార్ యాదవ్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి పని చేస్తున్నారు.కాగా ఇంట్లో ఎవరు లేని సమయంలో నవీన్‌కుమార్ తన భార్యతో కలిసి ఇంట్లో ఉన్న నగదుతో పాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.మంగళవారం ఉదయం కొండల్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి దుస్తులుచిందర వందరగా పడి ఉండటంతో పాటు అలుమార తెరిచి ఉన్నాయి.దీంతో కొండల్‌రెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజేంద్ర